సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23 వేలు పలికాయి. మార్కెట్‌కు 162 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.3°/22.8°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత కొనసాగుతోంది. సాయంత్రం తర్వాత ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

'సూర్యఘర్'పై అవగాహన కల్పించండి



సదస్సుకు హాజరైన విద్యుత్ ఉద్యోగులు

హిందూపురం అర్బన్: ప్రతి ఒక్కరూ సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకొని విద్యుత్ ఆదా చేసుకొనేలా వినియోగదారుల్లో అవగాహన కల్పించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వాసవీ ధర్మశాలలో హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజక వర్గాల విద్యుత్ అధికారులు, సిబ్బందికి సోలార్ రూఫ్‌టాప్ నిర్మాణంపై అవగాహన కల్పించారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు 1 కిలో వాట్‌తో 120 యూనిట్లు ఉత్పత్తి అవుతుందన్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.30 వేలు రాయితీ ఇస్తున్నట్లు తెలియజేశారు. అలాగే 2 కిలో వాట్‌లకు 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఇందుకు రూ. 60 వేలు సబ్సిడీ ఉందన్నారు. అలాగే 3 కిలో వాట్లకు 360 యూనిట్లు తయారవుతుందని, ఇందుకు రూ.78 వేలు సబ్సిడీ అందుతుందన్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సదస్సులో ఈఈ భూపతి, అకౌంట్స్ అధికారి బాలాజీ వెంకటేష్, డీఈలు, ఏడీలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

- ఆర్‌బీఐ ఏజీఎం గిరిధర్



మాట్లాడుతున్న గిరిధర్

పరిగి: అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఐ ఏజీఎం గిరిధర్ పిలుపునిచ్చారు. ఆర్థిక అక్షరాస్యతపై పరిగి మండలం కొడిగెనహళ్లిలోని అంధుల ఆశ్రమ పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా గిరిధర్ హాజరై మాట్లాడారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద రూ.20 చెల్లించిన లబ్దిదారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.2 లక్షలు పరిహారం అందుతుందన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి పథకం కింద ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లించిన పాలసీదారుడి సాధారణ మరణానికి రూ.2 లక్షలు చెల్లిస్తారన్నారు. వీటితో పాటూ సుకన్య సమృద్ధి యోజన, అటల్ పింఛన్ యోజన పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమణకుమార్, ఆర్థిక అక్షరాస్యత క్లస్టర్ కోఆర్డినేటర్ శివశంకరరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్లు వీర, మారుతి, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఈఓకు సేవలందించలేదనే తొలగించారు

- ఫిజియోథెరపిస్టు మాధవి



కొత్తచెరువు డీఈఓ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న మాధవి తదితరులు

పుట్టపర్తి: డీఈఓ మీనాక్షికి వ్యక్తిగతంగా సేవలందించలేదని కక్ష గట్టి తనను ఉద్యోగం నుంచి టర్మినేట్ (తొలగింపు) చేశారని ఫిజియోథెరపిస్టు మాధవి ఆరోపించారు. ఆమె గురువారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ తదితరులతో కలిసి కొత్తచెరువు డీఈఓ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ గతంలో డీఈఓ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారన్నారు. ఆ సమయంలో ఇంటి వద్దకు వచ్చి ఫిజియోథెరపీ చేయాలని డిమాండ్ చేశారన్నారు. సరైన పరికరాలు లేకపోతే ఇంటి వద్ద ఫిజియోథెరపీ చేయడం కష్టమని డీఈఓకు వివరించానన్నారు. అప్పటి నుంచి తనపై కక్షకట్టి ఉద్యోగం నుంచి తొలగించారని వాపోయారు.

విధుల్లోకి తీసుకోవాలి..

డీఈఓ మీనాక్షి నియంతృత్వ ధోరణి అవలంబిస్తోందని మాధవి, మరో ఇద్దరు ఫిజియోథెరపిస్టులను అన్యాయంగా ఉద్యోగాల నుంచి తొలగించారని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేపడతామన్నారు.

భయం గుప్పిట్లో వైద్యం

వైద్యులు పునర్జన్మను ప్రసాదిస్తారు. అందుకే 'వైద్యోనారాయణో హరి' అంటారు. ప్రాణాలను నిలబెట్టగలిగే శక్తి ఒక్క వైద్యుల చేతుల్లోనే ఉంటుంది. అయితే అందరి ప్రాణాలను కాపాడే వైద్యులకే ప్రస్తుతం రక్షణ కరువైంది. రాత్రివేళల్లో విధులకు వెళ్లాలంటేనే మహిళా వైద్యులు బెంబేలెత్తాల్సిన పరిస్థితి నెలకొంది.

☛ కదిరి ఏరియా ఆస్పత్రిలో రాత్రి వేళల్లో విధులు నిర్వహించాలంటే భయంగా ఉంటోందని ఓ మహిళా వైద్యురాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన పోలీసు అవుట్ పోస్ట్‌లో రాత్రి వేళల్లో ఎవరూ ఉండడం లేదని చెబుతున్నారు. ఇప్పటికే చాలాసార్లు డీఎస్పీ, సీఐలకు సెక్యూరిటీ పెంచాలని వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఫలితం లేదని వాపోయారు.

☛ పెనుకొండ ప్రభుత్వాస్పత్రిలో రాత్రి పూట మద్యం తాగి దుండగులు చొరబడి వైద్యం చేయాలని నర్సులను దబాయిస్తున్నారు. రోడ్డు ప్రమాద కేసుల్లో ఒక్కోసారి 30 నుంచి 40 మంది ఆస్పత్రుల్లోకి వచ్చి చికిత్స చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మహిళలనే గౌరవం లేకుండా మద్యం మత్తులో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఓ వైద్యురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

☛ హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని మహిళా వార్డులోకి అనుమతి లేకున్నా పురుషులు లోపలికి వస్తున్నారని రోగులు వాపోతున్నారు. అక్కడ ఉన్న సెక్యూరిటీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని చెబుతున్నారు. ఒక రోగి వెంట ముగ్గురు, నలుగురు పురుషులు వస్తుండడంతో చిన్న పిల్లలతో ఉండాలంటే భయమేస్తోందంటున్నారు.



హిందూపురం: నిబంధనలకు విరుద్ధంగా గుంపులుగా ఉన్న రోగుల బంధువులు

- ప్రభుత్వాస్పత్రుల్లో మహిళా సిబ్బందికి రక్షణ కరువు
- అల్లరిమూకల చేష్టలతో ఇబ్బందులు
- పట్టించుకోని పోలీసులు
- ఆందోళనలో మహిళా వైద్యులు
- కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయని ఆవేదన

సాక్షి, పుట్టపర్తి: పోలీసుల పర్యవేక్షణ కరువు కావడంతో అల్లరిమూకలు ఆస్పత్రుల్లో ప్రవేశించి రోగులను, మహిళా సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలోని ప్రతి ప్రభుత్వాస్పత్రిలో రోజూ వెలుగు చూస్తున్నాయి. ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు పలుమార్లు పోలీసులకు సమాచారం ఇచ్చినా.. ఫలితం లేదని చెబుతున్నారు. రాత్రి వేళ గస్తీ నిర్వహించాల్సిన పోలీసులు అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది చెబుతున్నారు. మద్యం మత్తులో ఆస్పత్రుల్లో ప్రవేశించి నానా యాగీ చేస్తున్నా ఎవరికీ పట్టడం లేదని ఆవేదన చెందుతున్నారు. మహిళా డాక్టర్లతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు కూడా వెల్లువెత్తాయి. దీనికితోడు నిబంధనలు తుంగలో తొక్కి మహిళా వార్డుల్లోకి ప్రవేశం లేకున్నా చొరబడుతున్నారని సిబ్బంది చెబుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

ప్రతి ప్రభుత్వాస్పత్రిలో ఉద్యోగులకు రోజుకు మూడు రకాల షిఫ్టుల్లో డ్యూటీ ఉంటుంది. ముఖ్యంగా రాత్రివేళ డ్యూటీ చేసే వారికి చాలా ఇబ్బందిగా మారినట్లు స్పష్టమవుతోంది. ఆస్పత్రి పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్ నుంచి వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాల్సి ఉంటుంది. ఆస్పత్రిను 24 గంటలూ పోలీసులు కూడా పర్యవేక్షించాలి. అయితే అలాంటి పరిస్థితి జిల్లా పరిధిలోని ఏ ఆస్పత్రిలో కనిపించ లేదు. పగటి పూట రాకున్నా పర్లేదు.. కానీ రాత్రివేళల్లో పోలీసులు నిరంతర నిఘా ఉండాలని సిబ్బంది, రోగులు కోరుతున్నారు. ఇదే విషయమై ఆయా పోలీస్‌స్టేషన్లలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఏదో సాకు చెబుతున్నారని ఆస్పత్రి పెద్దలు చెబుతున్నారు.

రాత్రివేళల్లో ఇబ్బందులు



హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో రాత్రి సమయాల్లో సెక్యూరిటీ సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఆకతాయిలు, మందు తాగిన వారు రాత్రి సమయాల్లో ఆస్పత్రి వద్దకు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆస్పత్రిలో రోగులకు చూడడానికి వచ్చే వారి బంధువులు, మిత్రులను లోపలకు పంపకపోయిన మాపైనే నానా దుర్భాషలు ఆడుతుంటారు.

– అశోక్‌కుమార్, సెక్యూరిటీ సూపర్‌వైజర్, హిందూపురం

ప్రజల సహకారం అవసరం



ఆస్పత్రికి వచ్చే రోగులు యాజమాన్యం నిబంధనలకు అనుగుణంగా సహకరిస్తే బాగుంటుంది. ఒక రోగి వెంట ఒక అటెండెంట్‌ను మాత్రమే అనుమతిస్తాం. ఎంట్రీ పాస్ ఉన్న వారు మాత్రమే లోపలికి రావాల్సి ఉంటుంది. ఇబ్బడిముబ్బడిగా వచ్చి ఆస్పత్రి సిబ్బందిని ఇబ్బందులకు గురి చేయొద్దు. రాత్రి సమయాల్లో పోలీసు పర్యవేక్షణ లేదనే ఫిర్యాదులు నా దృష్టికి వచ్చిన మాట వాస్తవమే. లిఖితపూర్వకంగా జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశాను.

– రోహిల్ కుమార్, సూపరింటెండెంట్, హిందూపురం

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



రొళ్ల సీహెచ్‌సీలోకి రాత్రి సమయాల్లో ఎలుగుబంట్లు ప్రవేశిస్తున్నాయి. ఆ సమయంలో విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రి ఆవరణలో సీసీ కెమెరాలు కూడా లేవు. డాక్టర్లు, నర్సులతో పాటు రాత్రి వేళల్లో రోగులు కూడా భయాందోళనకు గురవుతున్నారు. సెక్యూరిటీ పరంగా కూడా బాగుంటుంది. – సృజన, వైద్యురాలు, రొళ్ల సీహెచ్‌సీ

విశ్రాంతి గదులు ఉండాలి



ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు సెక్యూరిటీ పెంచాలి. రాత్రి సమయాల్లో ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు పోలీసులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మహిళల పట్ల దుర్భాషలాడే వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రిలో మహిళలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి.
– వైష్ణవి, వైద్యురాలు, ధర్మవరం ప్రభుత్వాస్పత్రి

గుంపులుగా వస్తున్నారు



ప్రభుత్వ ఆస్పత్రిలో అల్లరిమూకలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. నిరంతర పోలీసు పర్యవేక్షణతోనే అది సాధ్యం. ఆస్పత్రిలోకి రోగితో పాటు చాలామంది గుంపులుగా వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రజలు సహకరిస్తేనే రోగికి వైద్యం అందించడానికి వీలవుతుంది.

– నేహా, గైనకాలజిస్ట్, పెనుకొండ ప్రభుత్వాస్పత్రి

పోలీసులు రక్షణ కల్పించాలి



కోల్‌కత్తాలో ఆస్పత్రిలోనే జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటన దారుణమైనది. పని ప్రదేశాల్లో రాత్రి వేళల్లో మహిళలకు రక్షణ చాలా అవసరం. హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పోలీసులను ఏర్పాటు చేసిన రక్షణ కల్పించాలి. ఆకయితాలు రాత్రి సమయాల్లో వచ్చి ఇబ్బందులు గురిచేస్తుంటారు. పోలీసుల గస్తీ పెంచాలి. – ఓబులమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్, హిందూపురం



హిందూపురం: మహిళల వార్డులోకి చొరబడిన పురుషులు



హిందూపురం: ప్రవేశం లేదని రాసినా వార్డులోకి వెళ్లిన పురుషులు



హిందూపురం: పార్కింగ్ వద్ద ఉన్న బయటి వ్యక్తులు

భూముల వివరాలు పక్కాగా ఉండాలి

- సీసీఎల్ఏ అడిషనల్ కమిషనర్ ఎన్.ప్రభాకరరెడ్డి



రీ వెరిఫికేషన్ రికార్డులను పరిశీలిస్తున్న సీసీఎల్ఏ అడిషనల్ కమిషనర్ ప్రభాకరరెడ్డి

బత్తలపల్లి: అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) పొందిన రైతుల భూముల రీ వెరిఫికేషన్ వివరాలను ప్రత్యేక ఫారంలో సవివరంగా నమోదు చేయాలని సీసీఎల్ఏ అడిషనల్ కమిషనర్ ఎన్.ప్రభాకరరెడ్డి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. గురువారం బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ సీవీ.రమణరావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నటరాజన్‌తో కలిసి సీసీఎల్ఏ అడిషనల్ కమిషనర్ ప్రభాకరరెడ్డి ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌ల రీవెరిఫికేషన్ చేయాల్సిన విధానాన్ని వీఆర్‌ఓలకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూముల చట్ట సవరణ ద్వారా ఫ్రీ హోల్డ్ అయిన భూముల రిజిస్ట్రేషన్‌లను కూటమి ప్రభుత్వం నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరు జిల్లాలను పైలట్ ప్రాజెక్టులుగా ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. అందులో శ్రీసత్యసాయి జిల్లా కూడా ఉందన్నారు. జిల్లాలోని బత్తలపల్లి మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారన్నారు. రైతులకు ప్రభుత్వం ఏ సంవత్సరంలో భూమి అసైన్‌మెంట్ చేసింది? ఆన్‌లైన్‌లో ఎవరి పేరు ఉంది? ఫ్రీ హోల్డ్ రైతు ఎవరు? రిజిస్ట్రేషన్ ఎవరి పేరున అయింది? ఈ విధంగా రీవెరిఫికేషన్ చేసే సమయంలో ప్రత్యేక ఫారంలో వివరాలన్నింటినీ సవివరంగా నమోదు చేయాలని వీఆర్‌ఓలను ఆదేశించామన్నారు. బత్తలపల్లి మండలంలో రిజిస్ట్రేషన్ అయిన 232 ఫ్రీ హోల్డ్ భూములలో గిఫ్టుగా ఎన్ని రిజిస్ట్రేషన్ అయ్యాయి? మార్ట్ గేజ్, అమ్మకాలు ఎన్ని రిజిస్ట్రేషన్ అయ్యాయి? తదితర వివరాలన్నీ నమోదు చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సమావేశంలో భూసర్వే తహసీల్దార్ సునీత, సీఎస్ డీటీ శారద, మండల సర్వేయర్ జోసఫ్, సబ్‌రిజిస్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సాయిలీల, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సరఫరాపై అవగాహన కల్పించండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

- ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 18004256041 ఏర్పాటు
- అక్రమ తవ్వకాల కట్టడికి ప్రత్యేకాధికారిగా జేసీ
- ఇసుకపై సమీక్షలో కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఉచిత ఇసుక పాలసీని సమర్థవంతంగా అమలు చేయాలని అక్రమ రవాణ, అక్రమ తవ్వకాల కట్టడికి ప్రత్యేకాధికారిని నియమించినట్లు కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. ఉచిత ఇసుక కార్యకలాపాలపై ఆయా శాఖల అధికారులతో ఎస్పీ రత్న, అడిషనల్ ఎస్పీ విష్ణు, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ భాగ్యరేఖ, మైన్స్ అధికారి రామమోహన్‌లతో కలిసి గురువారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ ఇసుక వినియోగదారులు బుకింగ్, రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. స్టాక్ యార్డు నుంచి ఇసుక తీసుకోవాలన్నారు. ఇసుక బుకింగ్ కోసం ప్రస్తుతం సీసీ రేవు గ్రామ సచివాలయంలో కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఉప్పలపాడులో మరో కౌంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని డీపీఓను ఆదేశించారు. జిల్లాలో ఇసుక సరఫరాలో ఫిర్యాదులు స్వీకరణకు కంట్రోల రూం ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నంబర్ 18004256041ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఐవీఆర్ఎస్ విధానం ద్వారా ఇసుక సరఫరాపై ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇసుక రవాణ చార్జీలను నోటిఫై చేయాలని రెవెన్యూ, రవాణ, పోలీస్, మైనింగ్ శాఖల ఆధ్వర్యంలో నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. బుకింగ్ ఇన్వాయిస్ లేకుండా స్టాక్ పాయింట్ వద్దకు వాహనాలు వెళ్లకుండా కట్టడి చేయాలన్నారు. ఇన్వాయిస్‌ల తనిఖీ కోసం చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు రవాణా, పోలీస్‌శాఖ సిబ్బందిని నియమించాలని సూచించారు. ప్రతి కేటగిరీ వాహనంపై కిలో మీటరుకు, మెట్రిక్ టన్నుకు రవాణా చార్జీలు ఖరారు చేయాలన్నారు. ఇసుక రవాణా చార్జీలు వినియోగదారునికి భారం కాకుండా చూడాలన్నారు. ఎక్కువ ధరలు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీపీఓ విజయ్ కుమార్, ఆర్డీఓ కరుణసాగర్‌రెడ్డి ఉన్నారు.

అదుపులోకి రాని అతిసారం



ఎం.రాయాపురంలో అస్వస్థతకు గురై పాఠశాలలో చికిత్స పొందుతున్న నాగేంద్రప్పను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు



ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

- ఎం.రాయాపురంలో కొత్తగా ఏడుగురికి అస్వస్థత
- వైద్య శిబిరంలో కొందరు, వివిధ ఆస్పత్రుల్లో మరికొందరికి చికిత్స
- బాధితుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్న జేసీ అభిషేక్‌కుమార్

రొళ్ల: ఎం.రాయాపురం గ్రామాన్ని అతిసారం పట్టి పీడిస్తోంది. గత ఏడు రోజులుగా ఏ విధుల్లో పర్యటించినా నిశబ్ద వాతావరణం నెలకొంది. వైద్యుల అంచనా ప్రకారం ఇప్పటి వరకూ సుమారు 55 మందికి పైగా అతిసారం బారిన పడ్డారని చెబుతున్నారు. ఇప్పటికే రత్నప్ప (63) హనుమంతరాయప్ప(75), పార్వతమ్మ (55) మృతి చెందిన విషయం తెలిసిందే. కొంత మంది కోలుకుంటున్నప్పటికి మరికొందరు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. గురువారం త్రివేణి, శివానందప్ప, మదన్‌కుమార్, నాగేంద్రప్ప, దేవదాస్, పుష్పతో పాటు వైద్య శిబిరంలో విధుల నిర్వహిస్తున్న ఈశ్వరికి కూడా అతిసారం సోకి అస్వస్థతకు గురయ్యారు. వైద్యం శిబిరం నిర్వహించి చికిత్స అందిస్తున్నా కూడా అతిసారం మాత్రం అదుపులోకి రావడం లేదు. వైద్య శిబిరంలో కేవలం అస్వస్థతకు గురైన బాధితులకు ఐవీ ఫ్లూయిడ్స్, యాంటీబయాటిక్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లుతో చికిత్స అందిస్తూ సరిపెడుతున్నారు. మందులు పని చేయక పోవడం వల్ల తీవ్రంగా అస్వస్థతకు గురవుతున్న బాధితులను 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు తరలిస్తున్నారు.

జాయింట్ కలెక్టర్ ఆరా..

ఎం.రాయాపురం గ్రామాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ గురువారం సాయంత్రం సందర్శించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ముఖ్యంగా అతిసారం సోకడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కలుషిత నీళ్లు తాగడం వల్లే ప్రజలు అతిసారం బారిన పడ్డారని వైద్య సిబ్బందికి జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. గ్రామాల్లో ఎక్కడా కూడా చెత్తా చెదారం, మురుగు నీళ్ల నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బాధితులను పరామర్శ..

ఎం.రాయాపురంలో అతిసారంతో అస్వస్థతకు గురై పాఠశాలలో చికిత్స పొందుతున్న నాగేంద్రప్పతో పాటు మరికొందరిని స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు పరామర్శించారు. తర్వాత ఇది వరకే మృతి చెందిన రత్నప్ప కుమారుడు వెంకటాచారి, పార్వతమ్మ కుమారుడు నవీన్, హనుమంతరాయప్ప కుమారుడు రాజప్పకు ఒక్కొక్కరికీ రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఎం.రాయాపురం గ్రామాన్ని సందర్శించి అతిసారంతో బాధపడుతున్న వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

● సమ్మెలోకి 'సత్యసాయి కార్మికులు'



ముదిగుబ్బలో నిరసన చేస్తున్న సత్యసాయి తాగునీటి కార్మికులు

సాక్షి పుట్టపర్తి: సమస్యల పరిష్కారానికై సత్యసాయి తాగునీటి కార్మికులకు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. ఇందులో భాగంగానే జిల్లాలో ఉన్న అన్ని పంప్ హౌస్‌ల వద్ద కార్మికులు గురువారం నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల జీతాలు వెంటనే చెల్లించాలంటూ కార్మికులు డిమాండ్ చేశారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించలేదని , చాలీచాలని జీతాలతో తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల బోనస్ కూడా పెండింగ్‌లో ఉంచారన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు వరకూ సమ్మె వీడేది లేదని స్పష్టం చేశారు.

కూటమి మట్టి దందా

- అక్రమ తవ్వకాలతో జేబులు నింపుకుంటున్న కూటమి నేతలు
- కరిగిపోతున్న రేగాటిపల్లి కొండ, రావులచెరువు
- రైతుల పొలాల మీదుగా అడ్డదిడ్డంగా దారుల ఏర్పాటు
- చోద్యం చూస్తున్న అధికారులు



మట్టిని తరలించేందుకు రేగాటిపల్లి ఎర్రకొండ వద్ద సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు



రావులచెరువు గ్రామ చెరువులో సాగిస్తున్న తవ్వకాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ, జనసేన నేతల అక్రమార్జనకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది. ప్రకృతి ప్రసాదించిన కొండల్లో మట్టిన తవ్వి అక్రమంగా తరలిస్తూ రూ.కోట్లు కూడబెట్టుకుంటున్నారు. వారి ధనదాహానికి ధర్మవరం మండలంలోని రేగాటిపల్లి కొండ, రావులచెరువు కనుమరుగవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు.

మట్టి మాఫియాకు కేరాఫ్ రేగాటిపల్లి

రేగాటిపల్లి గ్రామ సమీపంలో ప్రకృతి సిద్ధంగా ఉన్న ఎర్ర కొండ (గరుసు మట్టి కొండ)పై కూటమి నేతలు కన్నేశారు. కొండలో నాణ్యమైన ఎర్ర గరుసు పుష్కలంగా ఉండడంతో భారీ యంత్రాల సాయంతో రేయింబవళ్లు తవ్వకాలు చేపట్టారు. టిప్పర్ల ద్వారా పలు వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. టన్నుల కొద్దీ మట్టిని అక్రమంగా తరలిస్తుండడంతో రోజురోజుకూ కొండ కరిగిపోతోంది.

ప్రకృతి సంపదను దోచేసి...

సహజ సిద్ధంగా ఏర్పడిన కొండ గుట్టలను తవ్వకూడదంటూ ప్రభుత్వ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయినా కాసుల సంపాదన యావలో పడిన టీడీపీ, జనసేన నేతలు పోటాపోటీగా మట్టి తవ్వకాలు చేపట్టారు. అటవీ శాఖ పరిధిలోని ఈ కొండలో గతంలో పెద్ద ఎత్తున మొక్కల పెంపకాన్ని చేపట్టారు. అప్పట్లో నాటిన మొక్కలు ఇప్పుడు వృక్షాలుగా మారాయి. అయితే మట్టి తవ్వకాలతో ఆ వృక్షాలు కాస్త నేలమట్టమవుతున్నాయి.

అంతా ఆయన కనుసన్నల్లోనే..

కొండ గరుసును తరలించేందుకు కూటమి నేతలు సిండికేట్‌గా మారారు. వీరంతా రేయింబవళ్లు యంత్రాలతో మట్టిని తవ్వి పట్టణంలోని ప్రైవేట్ వెంచర్లకు టిప్పర్ల ద్వారా తరలిస్తుంటారు. గరుసుకు మంచి డిమాండ్ ఉండడంతో ఒక్కో ట్రాక్టర్‌కు రూ.వెయ్యి, టిప్పర్‌కు రూ.4వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ అక్రమాల వెనుక కూటమికి చెందిన ఓ ప్రధాన నేత ఉన్నట్లు సమాచారం. ఆయనకు నెలవారీగా వారు పెద్దమొత్తంలో నగదు ముట్టజెబుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆయన కనుసన్నల్లోనే అక్రమ దందా జరుగుతుండడంతో చర్యలు తీసుకునేందుకు అధికారులు సైతం వెనుకంజ వేస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి.

పేదల భూముల్లో రహదారులు..

రోజూ పేదల భూముల మీదుగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లు కొండ ప్రాంతానికి రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో భూములు గట్టిగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు. పొలాల్లో వెళ్లకూడదని అడ్డు చెప్పితే భౌతిక దాడులు చేస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రావులచెరువులోనూ మట్టి తవ్వకాలు..

ధర్మవరం మండలంలోని రావులచెరువులోనూ రేయింబవళ్లు గరుసు తవ్వకాలు సాగిస్తున్నారు. దీంతో చెరువు ప్రాంతం దెబ్బతింటోంది. ఇక్కడ ముఖ్యంగా టీడీపీ నాయకులు జేసీబీలను ఏర్పాటు చేసి తవ్వకాలు సాగిస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. రోజూ టన్నుల కొద్దీ మట్టిని అక్రమంగా రవాణా చేస్తూ రూ.లక్షల్లో అక్రమార్జన చేస్తున్నట్లు తెలుస్తోంది. చెరువులో మట్టి తవ్వకాలు ఆపాలంటూ స్థానికులు విజ్ఞప్తి చేసినా టీడీపీ నేతలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

'పురం'లో దారిదోపిడీ

హిందూపురం అర్బన్: స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడిని బెదిరించి నగదు అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. వివరాలు... రొద్దం మండలం దొడగట్టకు చెందిన శంకరరెడ్డి, గురువారం వేకువజామున హిందూపురం రైల్వే స్టేషన్‌లో రైలు దిగి నంది సర్కిల్ వద్దకు చేరుకోగానే ఓ దుండగుడు బెదిరించి, ఆయన వద్ద ఉన్న రూ.20 వేలు లాక్కొని ఉడాయించాడు. ఈ అంశంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ

- నిందితుడి అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

హిందూపురం అర్బన్: మేకలు కాసేందుకు వెళ్లిన మహిళను హతమార్చిన కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. జీవాలను అపహరించేందుకే మహిళను హతమార్చిన నిందితుడిని అరెస్ట్ చేశారు. హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీలు ఆర్ల శ్రీనివాసులు, కేవీ మహేష్ వెల్లడించారు. హిందూపురం మండలం మలుగూరుకు చెందిన జయమ్మ (54) మేకల పోషణతో జీవనం సాగిస్తోంది. ఈ నెల 19న ఉదయం మేకలను మేపునకు తోలుకెళ్లిన జయమ్మ జాడ తెలియకుండా పోయింది. ఆమె కుమారుడు సూర్యనారాయణ తన మిత్రుల సాయంతో ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో హిందూపురం అప్‌గ్రూడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై స్పందించిన సీఐ ఆంజనేయులు, చిలమత్తూరు ఎస్‌ఐ మునీర్ అహమ్మద్, కానిస్టేబుళ్లను కలుపుకుని మూడు బృందాలుగా విడిపోయి జయమ్మ కోసం గాలింపు చేపట్టారు. చివరకు శ్రీరాములు జామ తోట పక్కన ఉన్న పొలాల్లో జయమ్మ మృతదేహాన్ని గుర్తించారు. ఆమె గొంతును బిగించి ఊపిరి ఆడకుండా చేసి హతమార్చినట్లుగా నిర్ధారించారు.

అంతా పథకం ప్రకారమే...

జయమ్మ హత్య కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మంగా తీసుకున్న ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు నేతృత్వంలో సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ లోతైన విచారణ కొనసాగించారు. సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లి గేట్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఈదుల బలాపురానికి చెందిన కంబాలప్ప గారి హరి అలియాస్ కథల హరిని గురువారం అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు. దీంతో జయమ్మను హతమార్చి మేకలను అపహరించుకెళ్లినట్లుగా హరి అంగీకరించాడు. గుంటూరు సెల్ఫ్‌లు, మేకల వ్యాపారంతో జీవనం సాగించే హరి... వ్యసనాలకు బానిసగా మారాడు. ఈ క్రమంలో తన జల్సాలు తీర్చుకునేందుకు మేకలు అపహరించుకెళ్లి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. ఇందు కోసం ఒంటరిగా మేకలు మేపుతున్న మహిళలను లక్ష్యంగా చేసుకునేవాడు. ఈ క్రమంలోనే రాచపల్లి గ్రామ శివారులో మేకలు మేపుతున్న ఒంటరి మహిళను హతమార్చి జీవాలు అపహరించుకెళ్లేందుకు ప్రయత్నించాడు. సాధ్యం కాకపోవడంతో జయమ్మను ఎంచుకున్నాడు. హత్యకు 15 రోజుల ముందు మేకలు మేపేందుకు వెళ్లిన ఆమెతో మాటలు కలిపి పరిచయం చేసుకున్నాడు. అనంతరం ఈ నెల 19న శ్రీరాములు జామ తోట పక్కన మేకలను మేపునకు తోలుకొచ్చిన జయమ్మను కలసి మాటల్లో పెట్టి ఆమె దృష్టి ఏమార్చి చేతి రుమాలుతో గొంతును బిగించి, ఊపిరి ఆడకుండా చేసి హతమార్చాడు. అనంతరం 13 మేకలను తనకు పరిచయస్తుడైన వ్యక్తి బొలెరో వాహనంలో ఎత్తుకెళ్లాడు. నిందితుడి నుంచి 13 మేకలు, బొలెరో వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన పెనుకొండ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ మునీర్ అహమ్మద్, సిబ్బందిని ఎస్పీ వి.రత్న అభినందించారు.

చెరువులో పడి వివాహిత మృతి

కళ్యాణదుర్గం రూరల్: చెరువులో పడి ఓ వివాహిత మృతి చెందింది. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం హులికల్లు నివాసి ఆంజనేయులకు ఎనిమిదేళ్ల క్రితం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన అనిత (28)తో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ పనులు, పాడి పోషణతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం గేదెలను మేపునకు గ్రామ శివారులోని చెరువు వద్దకు అనిత తోలుకెళ్లింది. సాయంత్రం గేదెలు మాత్రమే ఇంటికి చేరుకున్నాయి కానీ, అనిత జాడ లేదు. దీంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టిన ఫలితం లేకపోయింది. దీంతో బుధవారం ఉదయం కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు భర్త ఆంజనేయులు ఫిర్యాదు చేశాడు. గురువారం ఉదయం చెరువు వద్దకెళ్లిన స్థానికులకు నీటిలో తేలియాడుతున్న మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న ఆంజనేయులు, బంధువులతో పాటు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. వెలికి తీసిన మృతదేహాన్ని ఆంజనేయులు గుర్తించి అనితదేనని నిర్ధారించాడు. ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిందా? లేక ఎవరన్నా హతమార్చి నీటిలో పడేశారా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు



కాలిపోయిన ద్విచక్ర వాహనం

హిందూపురం అర్బన్: స్థానిక హస్నాబాద్‌లో రెండు ద్విచక్ర వాహనాలకు గురువారం వేకువజామున దుండగులు నిప్పు పెట్టారు. టీ స్టాల్ నిర్వాహకుడు ఇక్బాల్ తన ఇంటి ఎదుట ఆపిన బైక్‌తో పాటు, దాని పక్కనే ఉన్న మరో ద్విచక్ర వాహనం కాలి బూడిదయ్యాయి. ఘటనపై ఇక్బాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ధర్మవరం అర్బన్: స్థానిక మారుతీనగర్‌లో పేకాట ఆడుతూ ఆరుగురు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.42,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు వివరించారు.

వివాహిత ఆత్మహత్య

హిందూపురం అర్బన్: మండలంలోని మలుగూరుకు చెందిన వివాహిత వెంకటలక్ష్మి(45) ఆత్మహత్య చేసుకుంది. ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమెకు భర్త గోవిందప్ప చికిత్స చేయిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం నొప్పి తీవ్రత తట్టుకోలేక క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

కుందుర్పి: బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పికి చెందిన రంగప్ప (59)కు ఇద్దరు భార్యలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా మతిస్థిమితం లేక ఇబ్బంది పడుతున్న ఆయన గురువారం ఆ గ్రామ శివారులోని బెస్తవారి బావి వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. అనంతరం కాళ్లు శుభ్రం చేసుకునేందుకు వ్యవసాయ బావిలోకి దిగుతుండగా అదుపు తప్పి నీళ్లలో పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మామపై అల్లుడి దాడి

తాడిపత్రి అర్బన్: భార్యను కాపురానికి పంపలేదన్న కోపంతో ఆమె తండ్రిపై భర్త దాడి చేశాడు. సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన మేరకు... తాడిపత్రిలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన శంభూదాస్... తన కుమార్తె మమతను మూడేళ్ల క్రితం యాడికి మండలం నగరూరుకు చెందిన చిరంజీవికి ఇచ్చి వివాహం చేశారు. అదనపు కట్నం కోసం చిరంజీవి వేధిస్తుండడంతో ఆమె పుట్టింటికి చేరుకుంది. అప్పటి నుంచి పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించారు. అయినా సమస్యకు పరిష్కారం దక్కలేదు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం నంద్యాల రోడ్డులో వేచి ఉన్న శంభుదాస్‌తో చిరంజీవి గొడవకు దిగాడు. తన భార్యను కాపురానికి పంపాలని వాదిస్తూ కొడవలితో దాడి చేసి, పరారయ్యాడు. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత బలవన్మరణం



సునీత మృతదేహం

గుత్తి రూరల్: జీవితంపై విరక్తితో ఓ వివాహిత సునీత(34) ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... గుత్తి మండలం తురకపల్లికి చెందిన రైతు వెంకటేశ్వరరెడ్డి, సునీత దంపతులు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. మూడేళ్లుగా మానసిక స్థితి సరిగా లేని సునీతకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. గురువారం కుటుంబసభ్యులందరూ గుత్తిలో జరిన ఓ వివాహ వేడుకకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సునీత... క్రిమి సంహారక మందు తాగింది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న వెంకటేశ్వరరెడ్డి... ఓ మూలన అపస్మారక స్థితిలో పడి ఉన్న భార్యను గమనించి వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నబీరసూల్... ఆస్పత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి మత్తు వీడితే బంగారు భవిష్యత్తు



గంజాయి సేవిస్తూ పట్టుబడిన యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

పుట్టపర్తి టౌన్: గంజాయి మత్తు వీడితే బంగారు భవిష్యత్తు ఉంటుందని వ్యసనపరులైన యువతకు దిశ ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. గురువారం పుట్టపర్తిలోని అనుమానిత గంజాయి స్థావరాలల్లో సిబ్బందితో కలసి సీఐ సునీత తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గంజాయి సేవిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకుని దిశ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రులను పిలిపించి, వారి సమక్షంలోనే వ్యసనపరులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పిల్లల తప్పు దోవ పట్టకుండా వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులకు సూచించారు.

పాము కాటుతో మహిళ మృతి



లక్ష్మమ్మ (ఫైల్)

రొళ్ల: మండలంలోని దొమ్మరహట్టి గ్రామానికి చెందిన సుంకప్ప భార్య లక్ష్మమ్మ (54) పాము కాటుతో మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మేకల పోషణతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇంటి పక్కనే ఉన్న పాకలో విడిచిన మేకలకు గురువారం సాయంత్రం మేత పెట్టేందుకు వెళ్లిన సమయంలో లక్ష్మమ్మను పాము కాటు వేసింది. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను రొళ్లలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ వాహనంలో మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అందించేలోపు ఆమె మృతి చెందింది.

వృద్ధుడి మృతదేహం లభ్యం

నల్లచెరువు: జూన్ 15న కనిపించకుండా పోయిన వృద్ధుడు మృతి చెందిన విషయం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... నల్లచెరువు మండలం గొర్లవాండ్లపల్లికి చెందిన రొద్దం సూర్యనారాయణరెడ్డి(64) జూన్ 15వ తేదీ రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. ఘటనకు సంబంధించి ఆయన కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో స్థానిక పాత రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం పడి ఉన్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న సూర్యనారాయణరెడ్డి కుటుంబసభ్యులు సైతం అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహం కనిపించకుండా పోయిన వృద్ధుడిదేనని నిర్ధారించారు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ లింగన్న తెలిపారు.

'సాక్షి'పై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అక్కసు

- అతిసారం బాధితులను కనీసం పరామర్శించలేదన్న వార్తపై చిందులు
- మహిళలపై నేరాల కేసుల్లో తనపేరు ఉన్న విషయాన్ని వెల్లడించడంపై ఆగ్రహం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు 'సాక్షి'పై అక్కసు వెళ్లగక్కారు. ఏడీఆర్, నేషనల్ ఎలక్షన్ వాచ్‌లో మహిళలపై జరిగిన నేరాలకు సంభందించిన కేసులో ఎంఎస్ రాజు పేరు ఉన్న విషయాన్ని 'సాక్షి' ప్రధాన సంచికలో ప్రచురించింది. అలాగే నియోజకవర్గంలోని గుడిబండ మండలం కొంకల్లు, రొళ్ల మండలం ఎం.రాయాపురంలో అతిసారం ప్రబలి 10 రోజుల వ్యవధిలో 10 మంది మృతి చెందడం, ఇంకా పదుల సంఖ్యలో బాధితులు చికిత్సలు పొందుతున్నా... స్థానిక ఎమ్మెల్యే కనీసం పరామర్శించలేదని 'సాక్షి' జిల్లా సంచికలో కథనం ప్రచురించింది. ఈ వార్తలను ఆయన జీర్ణించుకోలేక పోయారు. గురువారం మడకశిర ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్, నేషనల్ ఎలక్షన్ వెల్లడించిన అంశాలను ప్రచురించిన 'సాక్షి' దినపత్రికపై చిందులు వేశారు. తనకు వ్యతిరేకంగా సాక్షి యాజమాన్యం వార్తలు రాస్తోందని విరుచుకుపడ్డారు. తనపై కేసు లేదని గానీ, అతిసారం బాధితుల గురించి గానీ, ఆయా గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై గానీ మాట్లాడని ఎమ్మెల్యే... తాను రాష్ట్రంలోని అందరి ఎమ్మెల్యేల కంటే ఎక్కువగా పనిచేస్తున్నానంటూ గొప్పలు చెప్పుకున్నారు. అనంతరం ఆయన తన అనుచరులతో కలిసి పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో 'సాక్షి' పత్రిక ప్రతులను దహనం చేశారు. సాక్షి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీల హక్కులు కాలరాస్తే పతనం తప్పదు

- ప్రభుత్వాన్ని హెచ్చరించిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు



మాట్లాడుతున్న కేశన శంకరరావు

ధర్మవరం అర్బన్: బీసీల హక్కులు కాలరాస్తే పతనం తప్పదని కూటమి ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు హెచ్చరించారు. బీసీల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ధర్మవరంలోని ఎన్జీఓ హోంలో గురువారం బీసీల ఆత్మీయ సమావేశం జరిగింది. అంతకు ముందు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేశన శంకరరావు మాట్లాడుతూ... బలహీన వర్గాల అభ్యున్నతికి ఏ రాజకీయ పార్టీ సహకరించినా స్వాగతిస్తామన్నారు. బీసీల హక్కులను కాలరాస్తే ఎదురు తిరిగి పోరాడేందుకు సిద్ధమవుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కమిటీలు ఏర్పాటు చేసి బీసీల ఐక్యతను చాటుతామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్, పట్టణ అధ్యక్షుడు బండి వెంకటేష్, నాయకురాలు జయశ్రీ, బీసీ ఉద్యోగ సంఘం కార్యదర్శి చింతా నాగరాజు, రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు బద్దలాపురం నరసింహులు, వాల్మీకి సంఘం సీనియర్ నాయకులు బోయ రవిచంద్ర, బీసీ సంక్షేమ సంఘం పట్టణ కార్యదర్శి జంగమన్న, ఉపాధ్యక్షుడు రేగాటిపల్లి రవి, సహాయ కార్యదర్శి తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొట్నూరు డీలరుకు స్థానికుల మద్దతు



తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న కొట్నూరు వాసులు

హిందూపురం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కొట్నూరులోని స్టోర్ (1287031) డీలర్ రామకృష్ణారెడ్డిని తొలగించరాదంటూ తహసీల్దార్‌కు స్థానికులు విన్నవించారు. ఈ మేరకు గురువారం ఉదయం తహసీల్దార్ వెంకటేష్‌ను ఆయన చాంబర్‌లో గ్రామస్తులు కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. దాదాపు 20 ఏళ్లుగా డీలర్ రామకృష్ణారెడ్డి ఎంతో నమ్మకంగా తమకు సేవలు అందిస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలను ఆయన ఏనాడూ ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. అయితే ఇటీవల కొందరు స్టోర్ డీలర్ షిప్‌ను దక్కించుకునేందుకు అక్రమంగా రామకృష్ణారెడ్డిని తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని, ఇది చాలా బాధాకరమన్నారు. ప్రజల అభీష్టం మేరకు రామకృష్ణారెడ్డిని తొలగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గౌస్, రవీంద్రారెడ్డి, ముబషీర్, ఆనందరెడ్డి, అరుణ, అశ్వత్థమ్మ, గిరమ్మ, గౌరమ్మ, అరుణ, గంగరత్నమ్మ, జయమ్మ, లక్ష్మీనరసమ్మ, జ్యోతి, ఆదిలక్ష్మమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.